చదువుతోనే సమాజంలో సముచిత గౌరవం

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఆజాంపుర సర్కార్ బడిలో 'నాప్కిన్ దహన యంత్రం' ప్రారంభం
- యంగిస్తాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెల్త్ క్లబ్ ఏర్పాటు







కలెక్టర్, విద్యాశాఖ అధికారుల ఎదుట ప్రాజెక్టుల గురించి వివరిస్తున్న విద్యార్థులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్



ఆజాంపుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలెక్టర్, అధికారులు

అంబర్‌పేట: చదువుతోనే సమాజంలో సముచిత గౌరవం, స్థానం లభిస్తుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మెరుగైన సమాజం దేశ భవిష్యత్ కోసం విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన వెల్లడించారు. మంగళవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని ఆజాంపుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యంగిస్తాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్లబ్‌లో భాగంగా 'నాప్కిన్ దహన యంత్రం' ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై నాప్కిన్ దహన యంత్రాన్ని ప్రారంభించారు. ఎన్ని అవంతరాలు ఎదురైనా ఆత్మ విశ్వాసంతో చదువుకోవాలని ఆయన సూచించారు.

ఈ పాఠశాల రోల్ మోడల్‌గా నిలుస్తుంది..

- జిల్లాలో 384 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఏర్పాటు చేసే హెల్త్ క్లబ్‌లకు ఈ పాఠశాల రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. బాలకల కోసం ఇలాంటి ఏర్పాట్లు చేయడం అభినందనీయమని సంస్థ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. బాలకల చదువులకు ప్రభుత్వ పాఠశాలలో ఆటంకలు ఏర్పడకుండా కృషి చేస్తామన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన యంత్రంలో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు వచ్చిన తక్షణమే ఫిర్యాదు చేయాలన్నారు.
- అలాగే పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పలు అంశాలపై కలెక్టర్ ముచ్చటించారు. డీఈవో రోహిణి, ఎమ్మార్వో వీరాబాయి, డిప్యూటీ డీఈవో విజయలక్ష్మి, డిప్యూటీ ఐవోఎస్ నిజాముద్దీన్, జీఎం ఇండస్ట్రీస్ ప్రత్యేక అధికారి పవన్‌కుమార్, ఫౌండేషన్ ప్రతినిధులు అరుణ్, కృతిక, ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల నిరవధిక సమ్మెపై ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: డిగ్రీ కళాశాలల నిరవధిక సమ్మెపై ప్రభుత్వం జోక్యం చేసుకోని వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భోనగిరి మధు, పి.నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... తెలంగాణ వ్యాప్తంగా ఓయూ, కేయూ యూనివర్సిటీల పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరవధికంగా కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చాయని అన్నారు. ఈ బంద్‌లతో విద్యార్థుల చదువులు ఆగమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ఒక పక్క డిగ్రీ సెమిస్టర్ ఎగ్జామ్ ఫీజు కట్టి పరీక్షకు ప్రిపేర్ అవుతున్న సమయంలో కళాశాలల బంద్ విద్యార్థుల్లో ఆందోళన కలిగిస్తోందని అన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకోని కళాశాల నిరవధిక బంద్‌ను ఆపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మందా నవీన్, తీగల శ్యామ్, కె. ఝాన్సీ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీలకు పాల్పడి... తనిఖీల్లో పోలీసులకు చిక్కి!

ముగ్గురు పాత నేరస్తుల అరెస్టు

ముషీరాబాద్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న ముగ్గురు పాత నేరస్తులను ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ జి.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం... భోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్ జాకీర్ హుస్సేన్ అక్టోబర్ 10వ తేదీన తన ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీ అయినట్లు ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు 18వ తేదీన వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా కనిపించిన మహ్మద్ షాబుద్దీన్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతనితో పాటు భోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్ ఇర్ఫాన్‌లు ద్విచక్రవాహనాలను దొంగిలించి స్క్రాఫ్ దుకాణదారుడు మహ్మద్ అనవ్వర్ హుస్సేన్‌కు విక్రయించేవారమని అంగీకరించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అంబర్‌పేట, అల్లాపూర్, జూబ్లీహిల్స్, బోరబండ, పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 6 ద్విచక్రవాహనాలను దొంగిలించినట్లు అంగీకరించారని పోలీసులు పేర్కొన్నారు. వాళ్లు మూడు వాహనాల విడి భాగాలను అమ్ముకున్నట్లు తెలిపారు. మిగతా మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు. సమావేశంలో డీఐ నదీం హుస్సేన్, ఎస్సై వై.చలపతి, క్రైం స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల ఫీజుల దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న కేఎస్.ప్రదీప్, స్వరూప

నల్లకుంట: ట్రస్టు పేరిట ప్రభుత్వ రాయితీలు పొందుతూ రోగులను దోపిడీకి గురి చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని పీవైడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు కెఎస్. ప్రదీప్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని చేపట్టిన ఆందోళనలో భాగంగా పీవైడబ్ల్యూ, పీఓడబ్ల్యూ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం నల్లకుంటలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి(డీడీహెచ్)లో సర్వే చేపట్టారు.

- ఈ సందర్భంగా ఓపీ చికిత్సల కోసం వచ్చే రోగులు, వారి బంధువులను కలిసి అక్కడ వసూలు చేస్తున్న ఫీజులపై ఆరా తీశారు. అనంతరం ప్రదీప్, స్వరూప మాట్లాడుతూ.. ట్రస్టు పేరుతో ప్రభుత్వం నుంచి రాయితీలు పొందుతున్న దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి(డీడీహెచ్) యాజమాన్యం రోగుల నుంచి ముక్కు పిండి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తుందని ఆరోపించారు. ఇక్కడ ఓపీ ఫీజు రూ. 450 ఉందని, అలాగే అనారోగ్యంతో ఉన్న శిశువులను ఇంక్యుబేటర్‌లో ఉంచినందుకు రోజుకు రూ.10వేల నుంచి రూ.15వేలు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఇది ఎంతో భారమని రోగులు, వారి బంధువులు తమ సర్వేలో వివరించారని తెలిపారు.
- అలాగే ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇక్కడ కనీస పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయలేని స్థితిలో ఆస్పత్రి యాజమాన్యం ఉందని విమర్శించారు. డీడీహెచ్‌లో వసూలు చేస్తున్న అధిక ఫీజులపై పునః పరిశీలించాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని కోరారు. అధిక మొత్తంలో ఫీజుల వసూలుపై ప్రభుత్వం దృష్టి సారించి డీడీహెచ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్వే కార్యక్రమంలో పీఓడబ్ల్యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షకార్యదర్శులు ఎం.రవికుమార్, బీఎస్.కృష్ణ, లక్ష్మీబాయి, వరలక్ష్మి, నిర్మల, లత, బంగారు శ్రీనివాస్, రాజు, అంజి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యలో తెలుగు భోజనం

శ్రీఅయోధ్య వాసవీ ఆర్యవైశ్య నిత్యన్నదాన సత్రం ప్రారంభం

చిక్కడపల్లి: అయోధ్యలో తెలుగు రాష్ట్రాల యాత్రికుల కోసం శ్రీఅయోధ్య వాసవీ ఆర్యవైశ్య నిత్యన్న సత్రాన్ని ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ హరినాథ్‌గుప్తా బెలిదె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అయోధ్యతో పాటు కాశీ, ప్రయాగ్‌రాజ్, నైమిశారణ్యం యాత్రకు వెళ్లే తెలుగు భక్తులకు సేవలందించాలనే ఆలోచనతో సత్రాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. యాత్రలో భాగంగా సందర్శించాల్సిన స్థలాల గైడెన్స్, వసతి సౌకర్యాలతో పాటు చక్కటి తెలుగింటి భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. పూర్తి సేవా భావంతో అందించే ఈసేవలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలుగు భక్తులకు విజ్ఞప్తి చేశారు. తమ సేవలు పొందదానికి ఫోన్ నం.98487 87611లో సంప్రదించాలని కోరారు.

ఆంజనేయ హోమం

ముషీరాబాద్: విద్యానగర్‌లోని ప్రతిష్టాత్మక శృంగేరి మహా సంస్థానానికి చెందిన సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం గణపతి హోమం, రుద్ర హోమం, ఆంజనేయ హోమం నిర్వహించారు.ఈ రోజు(మంగళవారం)కు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఆరుద్ర నక్షత్రం, కార్తీక బహుళ చవితి, ఆంజనేయస్వామికి పర్వదినమైన రోజని నిర్వాహకులు తెలిపారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ఈ హోమాలు నిర్వహించారు.

వైభవంగా పునఃప్రతిష్ఠాపనోత్సవం

అంబర్‌పేట: బొడ్రాయి పునః ప్రతిష్ఠాపన మహోత్సవం కనులపండువగా కొనసాగుతోంది. మంగళవారం అంబర్‌పేట మహంకాళి ఆలయం ఎదురుగా పునః ప్రతిష్ఠిస్తున్న బొడ్రాయి కార్యక్రమం వైభవంగా జరిగింది. గణపతి, నవగ్రహ వంటి పూజా కార్యక్రమాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వై.శంకర్‌గౌడ్,రంగంపల్లి రాజు, మల్లికార్జున్‌గౌడ్, సుధాకర్,శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కాచిగూడ: ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద కాంగ్రెస్ నేత కె.పి.మురళీకృష్ణ దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇందిరాగాంధీ భారతజాతికి ఎన్నో సేవలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్, నాని, అనిల్ కుమార్, కడారి కుమార్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలతో దౌర్జన్యంగా వ్యవహరిస్తారా?



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.శ్రీనివాస్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రజల నోటి కాడి కూడును లాక్కునే ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించాలని ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లాలోని లగచర్లలో జరిగిన సంఘటనపై నిజానిజాలు తెలుసుకోవడానికి వెళ్తున్న మహిళా సంఘాలను అడ్డుకోవడమే కాకుండా బలవంతంగా వెనక్కు పంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ.. పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, ప్రొ. పద్మజషా, సజయా తదితరులతో పాటు పలువురు మహిళా నాయకులను పోలీసులు అక్రమంగా అడ్డుకుని వారిపట్ల దౌర్జన్యంగా వ్యవహరించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రజల భూములను ఫార్మా కంపెనీలకు ఇచ్చేది లేదంటూ భూముల పరిరక్షణ కోసం ఆరు నెలలుగా నిరసన తెలుపుతున్నామని అన్నారు. అయినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తూ భూములను గుంజుకోవాలని చూస్తోందని విమర్శించారు.

భారతీయ వివాహ వ్యవస్థ పటిష్టతకు కృషి చేయాలి



మ్యారేజ్ బ్యూరోస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న దైవజ్ఞశర్మ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భారతీయ వివాహ వ్యవస్థ పటిష్టతకు మ్యారేజ్ బ్యూరోలు కృషిచేయాలని సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆలిండియా మ్యారేజ్ బ్యూరోస్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దైవజ్ఞశర్మ మాట్లాడుతూ... భారతదేశంలో వివాహ వ్యవస్థకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. వివాహ వ్యవస్థను పునరుద్ధరించడానికి మ్యారేజీ బ్యూరోలు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. కులాలు, మతాలకు అతీతంగా జేఏసీ ఏర్పడటం హర్షణీయమని అన్నారు.

- ఆలిండియా మ్యారేజ్ బ్యూరోస్ అసోసియేషన్ జేఏసీ చైర్మన్ డీఎం అర్జున్‌రావు మాట్లాడుతూ... మ్యారేజ్ బ్యూరోలను ప్రభుత్వం గుర్తించి గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. మ్యారేజ్ బ్యూరోలపై వేధింపులను ఆపాలని ఆయన కోరారు. ప్రభుత్వ పరంగా అన్ని సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మ్యారేజ్‌బ్యూరోస్ అసోసియేషన్ జేఏసీ నాయకులు హరినాథ్‌గౌడ్, కల్పనారెడ్డి, వీరభద్రారెడ్డి, డి.పురుషోత్తం, పట్టాభిరామయ్య, సాయిప్రసాద్, చంటిబాబు, జి.నాగమణి, షేక్ రఫీ, తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళులు




ఇందిరాపార్కులో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

కవాడిగూడ: నిరుపేద, దళితుల ఆశాజ్యోతి మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం నగరంలోని ప్రసిద్ధిగాంచిన ఇందిరాపార్కులోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఏ-బ్లాక్ అధ్యక్షుడు వీడి కృష్ణ, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు జి. సాయిబాబా, మద్దుల ప్రభాకర్, సూర్యచంద్రశేఖర్, అభిషేక్ కెనడీ, శాంతి కుమార్, జి జగదీష్ పాల్గొన్నారు.

కోటి దీపోత్సవం.. కోటి పుష్పార్చన



కవాడిగూడ: ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కోటిదీపోత్సవ వేడుకపై పళని, తిరుచందూరు, తిరుత్తణి స్వామిమలై, తిరుప్పరన్‌కుండ్రం, పరముదిర్సోలై కుమారుస్వామి కల్యాణాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సుబ్రమణ్యస్వామికి భక్తులచే కోటి పుష్పార్చన జరిగింది. కేరళ కాసరగోడ్ యడనీర్ మఠం శ్రీసచ్చినందభారతి మహాస్వామి, కాశీ జగద్గురు శ్రీచంద్రశేఖర, శివాచార్యస్వామి, సద్గురు బ్రహ్మేశ్వరానంద ఆచార్య స్వాములు కలిసి ఆశీర్వచనం అందించారు. బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి ప్రవచనామృతాలు వినిపించారు.



మహిళలు స్వశక్తితో అన్ని రంగాలలో రాణించాలి

- హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ పళని కదిరవన్
- ప్రతి ఒక్కరూ పుస్తక పఠనానికి కొంత సమయం కేటాయించాలని సూచన



జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ పళని కదిరవన్



నగర కేంద్ర గ్రంథాలయంలో మహిళా ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్‌తో గ్రంథాలయ కార్యదర్శి పి.పద్మజ

చిక్కడపల్లి: మహిళలు అన్ని రంగాలలో స్వశక్తితో రాణించాలని నగర గ్రంథాలయ పర్సన్ ఇన్‌చార్జి, హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ పళని కదిరవన్ అన్నారు. 57 జాతీయ గ్రంథాలయ వారోత్సవాల భాగంగా చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం ఇందిరాగాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి అడిషనల్ కలెక్టర్ నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పుస్తక పఠనానికి రోజులో కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన గ్రంథాలయ ఉద్యోగులతో పని చేస్తున్న సిబ్బందిని ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజ, మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఫణికుమార్, గ్రంథాలయ ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల సంఘం నాయకులు కొక్కుల దేవేందర్, సత్యనారాయణ, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చాగంటి అయోధ్య, కార్యదర్శి బొల్లం మహేందర్, వరప్రసాద్, సభ్యులు నరేందర్, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, అవినాష్, వెంకటేష్‌యాదవ్, సుఖేశ్‌కుమార్, గ్రేడ్-1 లైబ్రేరియన్ చంద్రకళ, సుబ్బలక్ష్మి, శుక్ల ప్రతిభారెడ్డి, లలిత, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

అసమానతలను రూపుమాపడానికే సమగ్ర కుటుంబ సర్వే

బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో అసమానతలను రూపుమాపడానికే ఈ సమగ్ర కుటుంబ సర్వేను ప్రభుత్వం చేపట్టిందని.. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతంగా కొనసాగుతోందన్నారు. జాతీయ బీసీ దళ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కుటుంబ సర్వేకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే దేశ ప్రజలందరి దృష్టిని ఆకర్షిస్తోందని ఆయన పేర్కొన్నారు. సమగ్ర కుల సర్వే వివరాలను అత్యంత భద్రంగా ఉంచాలన్నారు. ప్రజల వ్యక్తిగత వివరాలు దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం, అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల స్థితిగతులు తెలుసుకుని ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలను విస్తృతం చేయడంతో పాటు కొత్త పథకాల అమలు కోసం ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సర్వే దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. మంచి ఉద్దేశంతో చేపడుతున్న సర్వే గురించి రాద్ధాంతం చేయడం సరైన పద్ధతి కాదని ప్రతిపక్ష పార్టీలకు ఆయన సూచించారు.

ఎస్సీ కార్పొరేషన్, దళితబంధు నిధులు విడుదల చేయాలి

ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్

నల్లకుంట: ఎస్సీ కార్పొరేషన్, దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె. లక్ష్మణ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఎంతో కొంతైనా దళిత సంక్షేమాన్ని పట్టించుకున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా దళితుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో దళితబంధు రూ.12 లక్షలు ఇస్తామని, ఎస్సీ కార్పొరేషన్ నిధులు విడుదలపై ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. పైగా కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజాపాలన పేరిట ప్రజా విజయోత్సవాలు జరుపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో దళితుల సంక్షేమం కోసం ఏం చేశారో చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే రాజకీయాలకు అతీతంగా దళితులంతా ఏకమై త్వరలో రానున్న గ్రామ పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి

అంబర్‌పేట: ఖాళీ ప్రదేశాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా జీహెచ్‌ఎంసీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్లలోని అయ్యప్ప ఆలయ పరిసరాల్లో, శ్రీనివాస్‌నగర్‌కాలనీలో ఎంతో కాలం నుంచి చెత్త పేరుకుపోయిందని స్థానికుల నుంచి ఫిర్యాదు అందడంతో కార్పొరేటర్ స్పందించారు. జీహెచ్‌ఎంసీ, విద్యుత్ విభాగం అధికారులను సమన్వయం చేసి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త, పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. డివిజన్‌లో పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధన్యం కల్పిస్తున్నట్లు చెప్పారు.

లోక్ మంథన్ పోస్టర్ ఆవిష్కరణ

అంబర్‌పేట: దేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రదర్శించే ఉత్సవంలో తాము సైతం భాగస్వాములం అవుతామని డీడీకాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు హైటెక్ సిటీ శిల్పకళ వేదికలో లోక్ మంథన్ పేరిట నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ని మంగళవారం కాలనీలో ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలకు తాము హాజరై దేశ సంస్కృతిలో భాగమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు గోవర్ధన్‌రెడ్డి, ప్రసన్న, పాండురంగయ్య, వీణ డిగ్గికర్ తదితరులు పాల్గొన్నారు.

'5కె రన్ ఫర్ గోమాత'కు ఎంపీ ఈటలకు ఆహ్వానం

కాచిగూడ: గోమాతకు జాతీయ తల్లి హోదా కల్పించాలని డిసెంబర్ 15న ఆదివారం ఉదయం 6 గంటలకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో '5కె రన్ ఫర్ గోమాత' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ 5కె రన్‌కు రావాల్సిందిగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు మంగళవారం సర్వదళ గోరక్షణ మండలి జాతీయ అధ్యక్షుడు జయపాల్‌సింగ్ నయాల్ ఆహ్వాన పత్రికను అందజేశారు. గోమాత కోసం నిర్వహించే రన్‌లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'పురుషులు' మానసిక ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించాలి

చిక్కడపల్లి: పురుషులు తమ మానసిక ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ పద్మాకమలాకర్ అన్నారు. అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అశోక్‌నగర్ క్రాస్‌రోడ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. మగవారు ఎక్కువగా తమ భావాలను బయట పెట్టకుండా దాచి పెట్టడంతో తీవ్రమైన ఒత్తిడి నిరాశకు గురవుతారని అన్నారు. ఆర్థిక సమస్యలు కుటుంబ బాధ్యతలు, సామాజిక అంచనాల వంటి కారణాలతో సమస్యలను వ్యక్తం చేయరన్నారు. ఈ క్రమంలో సతమతమవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతుండటం బాధాకరమని అన్నారు. పురుషులను గౌరవించి ప్రేమను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు డాక్టర్ రమేష్, శోభారాణి, జయశ్రీ, శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

నల్లకుంట: ఆర్థికపరమైన విషయంలో భార్యాభర్తల మధ్య జరిగిన చిన్న గొడవతో మనస్తాపం చెంది ఇంటి నుంచి వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చేసింది. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాలు.. ఆటో డ్రైవర్ ఇస్లావత్ గోవింద భార్య ఇస్లావత్ లకమ్మ(60)తో కలిసి అడిక్‌మెట్‌లోని భవాని హోటల్ సమీపంలో నివాసముంటున్నారు. ఈనెల 18న ఉదయం 10 గంటల సమయంలో ఆర్థిక పరమైన(డబ్బుల) విషయంలో భార్యాభర్తలిద్దరు గొడవ పడ్డారు. అనంతరం గోవింద్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చే చూడగా ఇంట్లో భార్య కనిపించలేదు. అన్ని చోట్ల వెతికినప్పటికీ భార్య ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన గోవింద్ తన భార్య కనిపించడం లేదంటూ మంగళవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన నల్లకుంట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.